క్లుప్తంగా

గృహ నిర్మాణాలపై దృష్టి

దత్తిరాజేరు: మండలంలో వివిధ దశల్లో నిలిచిపోయిన గృహనిర్మాణాలపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దృష్టిసారించి, వాటిని పూర్తి చేయించాలని మండల ప్రత్యేక అధికారి జోషెఫ్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన మండల అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఇళ్ల లే అవుట్‌లలో విద్యుత్, తాగునీరు, రోడ్లు, కాలువలు తదితర సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. హౌసింగ్ డీఈ సత్యనారాయణ మాట్లాడుతూ సొంత స్థలాల్లో చేపడతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు ఆదేశించారు.

కంప్యూటరీకరణను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సూర్యనారాయణరాజు

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామ పీఏసీఎస్‌లో రైతుల ఖాతాలు, ఇతర వివరాలను కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆ పీఏసీఎస్ ప్రత్యేక అధికారి బి.మురళీ ధరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కె.వి.సూర్యనారాయణరాజు సూచించారు. కెల్ల పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.అక్టోబర్ నెలాఖరుకు సొసైటీ వివరాలన్నీ కంప్యూటరీకరణ పూర్తి చేస్తామని రైతులకు అధికారులు తెలియజేశారు. నాయకులు కెల్ల వెంకటరమణ,కర్రోతు గోవింద్, కొంచాడ ఈశ్వరరావు, కెల్ల పైడిరాజు పాల్గొన్నారు.

25 మద్యం సీసాల స్వాధీనం

లక్కవరపుకోట: మండలంలోని నిడుగట్టు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపారు. నిడుగట్టు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం

మండల కేంద్రంలో ఓ వ్యక్తి అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేస్తుండగా బుధవారం పట్టుకున్నామని ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. సుమారు రూ.40వేల విలువైన మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

గానగంధర్వుడికి నివాళి



బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని గరివిడి పట్టణంలో సహాయ్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సహాయ్ పార్క్ వద్ద బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి స్వచ్ఛంద సంస్థ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రమీల కుమార్, ఉప్పు శ్రీనివాసరావు, బలగ అప్పారావు,గణేష్, రాంబాబు మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన పాడిన పాటలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయన్నారు.

నేడు గ్రామ సందర్శన

లక్కవరపుకోట/కొత్తవలస: ఎల్.కోట మండలంలోని కళ్లేపూడి ,కొత్తవలస మండలంలోని వీరభద్రపురం గ్రామాల్లో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు కె.రూపేష్, వై.పద్మజ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మండల అధికారులు గ్రామాల్లో పర్యటించి, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ డిపోలను సందర్శిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందజేయవచ్చని సూచించారు.

పాచలవలసలో..

దత్తిరాజేరు: మండలంలోని పాచలవలస గ్రామంలో గురువారం ఉదయం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.అన్ని శాఖల అధికారులు హాజరవుతా రని, ప్రజలు సమస్యలు తెలుసుకుని పరిష్క రించనున్నట్లు పేర్కొన్నారు.

విజినిగిరిలో..

జామి: విజినిగిరి గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సతీష్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి రామ్‌గోపాల్ , ఇతర అధికారులు కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు.

ముకుందపురంలో..

వేపాడ: ముకుందపురం గ్రామంలో గురువారం గ్రామసందర్శన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కూర్మనాథ్ పట్నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ, మండల అధికారుల హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

గ్రామసభల్లో తీర్మానించిన పనులకే ప్రాధాన్యం

- చట్ట ప్రకారం సర్పంచ్‌ల పర్యవేక్షణలోనే ఉపాధి హామీ పనులు జరగాలి
- ఎరువుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి
- మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



సర్వసభ్య సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

వేపాడ: ఇటీవల గ్రామసభల్లో తీర్మానించిన అభివృద్ధి పనులను చేపట్టేందుకే తొలిప్రాధాన్యం ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం ద్వారా ఆ పనులు కూడా సర్పంచ్‌ల పర్యవేక్షణలో జరగాలని జిల్లా పరిషత్‌చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు వివరించగా, సభ్యులు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులపై ఏపీఓ ఆదిలక్ష్మి సభ్యులకు వివరించారు. జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ గ్రామసభల్లో తీర్మానించిన ఉపాధి హామీ పనులను చట్టంలో పేర్కొన్న విధంగా సర్పంచ్‌లే చేపట్టాలని సూచించారు. సర్పంచ్ పనులు చేయలేని పరిస్థితి ఉంటే సర్పంచ్ అనుమతితో వెండర్‌తో చేయించాలని చట్టంలో ఉందన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ఉపాధి పనులు చేపట్టి గ్రామాల అభివృద్ధికి అవరోధం కలిగించవద్దని అధికారులకు సూచించారు.

ఎరువుల కొరత

జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావుతో పాటు పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ మండలంలో ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎరువుల దుకాణాల యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నారని ఆరోపించారు. జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ ప్రభుత్వం రైతులకు ఎరువులు పంపిణీ చేయలేకపోతే, ప్రైవేటు దుకాణాల్లో కొరత లేకుండా చూడాలని, డీలర్లు అధిక ధరలకు ఎరువులు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. సోంపురం గ్రామంలో రైతులకు పంపిణీ చేసిన వరి స్వర్ణ, 1121 రకం విత్తనాల నారు నాటిన చోట కేలీలు వచ్చాయని ఎంపీటీసీ సత్యనారాయణ సభలో చెప్పడంతో జెడ్పీ చైర్మన్ వ్యవసాయశాఖ జేడీకి ఫోన్‌చేసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని కోరారు.

బకాయిలు చెల్లించండి

గ్రామాల్లో గత ప్రభుత్వం హయాంలో చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏఈలను జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. అరిగిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి స్థానిక ఎమ్మెల్యే అనుమతితో ప్రారంభించాలన్నారు. జేఎల్ఎంలు వీధి లైటు వేయడం లేదని సభ్యులు చెప్పడంతో.. వీధి లైట్లు వేయిం చాలని విద్యుత్ శాఖ ఏఈ సూరిబాబును జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు నిర్మాణం చేపట్టకపోతే రద్దు చేయాలే తప్ప ఇష్టం వచ్చినట్లు రద్దు చేయవద్దని గృహనిర్మాణశాఖ ఏఈ అప్పలనాయుడుకు సూచించారు. బానాది గ్రామపంచాయతీ సమావేశాన్ని పంచాయతీ కార్యదర్శి నిర్వహించడం లేదని సర్పంచ్ యశోద సభ దృష్టికి తీసుకొచ్చారు. వారం లోగా సమావేశం నిర్వహించాలని, లేకుంటే పంచాయతీ కార్యదర్శికి నోటీసు జారీ చేయాలని ఈఓపీఆర్డీ ఉమను చైర్మన్ ఆదేశించా రు. అలాగే ఆతవ, ఆకులసీతంపేట ఏకగ్రీవ పంచాయతీలకు నిధులు మంజూరుచేసి, ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఈఓపీఆర్డీకి సూచించారు.

ఇష్టారీతిగా తొలగించడం సరికాదు

డ్వాక్రా సంఘాలకు సంబంధించి ఎప్పటి నుంచో పనిచేస్తున్న వీఓఏలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగించి కొత్తవారిని నియమించుకున్నారని శింగరాయి, వావిలపాడు సర్పంచ్‌లు వెంకటరావు, రాజేశ్వరి సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెలుగు ఏపీఓ వెంకటరమణను జెడ్పీ చైర్మన్ వివరణ కోరారు. వీఓఏల పోస్టుల భర్తీని నిబంధనలమేరకు చేపట్టాలని, ఇష్టం వచ్చినట్లు చేయడం, తొలగించడం సరికాదన్నారు. నోటీసులు ఇవ్వకుండా వీఓఏలను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. సర్వసభ్యసమావేశం దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.. కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ చినరాము నాయుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



గుర్ల: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, అధికారులు



గజపతినగరం:వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, తదితరులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో డిస్కస్‌త్రో పోటీల్లో విద్యార్థులు

గుర్ల: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన మండలస్థాయి అండర్–14, 17స్కూల్ గేమ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడ ల్లోనూ రాణిం చాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, ఎంఈఓలు ఎస్.భానుప్రకాష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

గజపతినగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. మరుపల్లి ఉన్నత పాఠశాల మై దానంలో బుధవారం నిర్వహిం చిన మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను స్థానిక సర్పంచ్ లెంక రామలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఖోఖో,కబడ్డీ, వాలీబాల్, చెస్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్, వ్యాయామ ఉపాధ్యాయుల ఇన్‌చార్జి చింత సత్యనారాయణ, మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ సునీత, హెచ్‌ఎం వి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను గరివిడి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఎంఈఓ పి.రామారావు, కొండ పాలెం మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ బమ్మిడి కార్తీక్, స్థానిక నాయకుడు సారిపాక సురేష్ బుధవారం ప్రారంభించారు. స్కూల్‌గేమ్స్ ఫెడ రేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన ఖోఖో, కబడ్డీ,వాలీబాల్, షార్ట్‌పుట్, ఫుట్‌బాల్, డిస్కస్‌త్రో, చెస్,అథ్లెటిక్ పోటీలకు వివిధ స్కూళ్ల నుంచి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీలు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగాయి. పీఈటీ లు జి.సూర్యలక్ష్మి, వి.ఉషారాణి, పి.రమేష్, ఎం.శేఖర్‌బాబు, టి.సత్యనారాయణ, టి.సత్తిబాబు, ఎం.శ్రీకాంత్, జి.అప్పారావు పాల్గొన్నారు.

నేటి నుంచి...

దత్తిరాజేరు: మరడాం ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మండల స్థాయి అండర్–14,17 స్కూల్ గేమ్స్ పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయని ఎంఈఓ వెంకటరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, అథ్లెటిక్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అన్ని ఉన్నత పాఠశాలల పీఈటీలు సమయానికి విద్యార్థులను తీసుకొని హాజరు కావాలని కోరారు.

సామూహిక సీమంతం



లక్కవరపుకోట: గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు



శృంగవరపుకోట: వెంకటరమణపేటలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

లక్కవరపుకోట: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ పీఓ ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో గర్భిణు లకు బుధవారం సామూ హిక సీమంతం నిర్వహించారు. అతిథిగా ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరై గర్భిణులకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ అందించి ఆశీర్వదించా రు. అమ్మపాలు అమృత సమానమని, బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలే పట్టాలని గర్భిణులకు సూచించారు.తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ రూపేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణపేటలో...

శృంగవరపుకోట: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా వెంకటరమణపేట గ్రామంలో తిమిడి సెక్టార్ పరిధిలోని 25 అంగన్‌వాడీ కేంద్రా ల పరిధిలోని గర్భిణులకు ఆ కేంద్రాల కార్యకర్తల ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతం నిర్వహించారు. అలాగే తక్కువ ఖర్చుతో పౌష్టికాహార పదార్థాలు తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఎం.కోటిబాబు, ఎంపీటీసీ రామచంద్రరావు, ఐసీడీఎస్ పీఓ ఉమ, సూపర్‌వైజర్ సుశీల, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ



పడాల అరుణను పరామర్శిస్తున్న ఝాన్సీ లక్ష్మి, శంబంగి తదితరులు

గజపతినగరం: మాజీ మంత్రి, నియోజకవర్గ జనసేన నాయకురాలుపడాల అరుణ కుమారుడు శరత్‌చంద్ర అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పల నాయుడు బుధవారం గజపతినగరంలో పడాల అరుణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. శరత్‌చంద్ర మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, నాయకులు కె.పైడిపునాయుడు, మండల లక్ష్మునాయుడు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట: స్థానిక రూరల్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు, ఇతర మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని గొల్జాం, కళ్లేంపూడి, సీతారామపురం, వేపాడ మండలంలోని పాటూరు, బొద్దాం, కొత్తబొద్దాం, ఓబలయ్యపాలెం, ముకుందపురం గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



మెరకముడిదాం: కేజీబీవీలో ఉపాధ్యాయినులతో మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, తదితరులు

మెరకముడిదాం: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే పీఆర్టీయూ ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆల్తి రాంబాబు అన్నారు.మండల పీఆర్టీ యూ నాయకులతో కలిసి స్థానిక ఉన్నత పాఠశాల, కేజీబీవీ, గర్భాం మోడల్‌స్కూల్‌ను బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యల ను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరకముడిదాం ఉన్నత పాఠశాలకు ల్యాబ్ పరికరాలను ప్రభుత్వం వెంటనే సరఫరా చేయాలన్నారు. కేజీబీవీ సిబ్బందికి ప్రతినెల 1వ తేదీన వేతనాలు అందించాలని, అలాగే మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్‌స్కూల్ సిబ్బందికి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని కోరారు. అన్ని పాఠశాలల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి హెల్త్ కార్డులుజారీ చేయాలని కోరారు. అలాగే ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రెండునెలలుగా ఎస్ఎస్ఏ సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే విడుదల చేయాలని కోరారు. పీఆర్టీయూ మండల నాయకులు ఆర్.సింహాద్రి, ఎస్.రామారావు, ఏ.సత్యనారాయణ, డి.శ్రీనివాసరావు, ఈశ్వరరావు, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

డీపీఆర్టీయూ కార్యవర్గ సమావేశం

జామి: ఉపాధ్యాయుల సర్వీస్ సంబంధిత సమస్యల పరిష్కారానికి డీపీఆర్టీయూ (డెమొక్రటిక్ పీఆర్టీయూ) కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.రమణ అన్నారు. మండలంలోని బలరాంపురంలో భార్గవ్ హెల్ప్‌లైన్ కార్యాలయంలో డీపీఆర్టీయూ మండల అధ్యక్షుడు కోరాడ రమణ ఆధ్వర్యంలో కార్యవర్గసమావేశం బుధవారం నిర్వహించారు. సంఘం తరపున చేపట్టనున్న సేవా కార్యక్రమాలపై చర్చించారు.పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మండల విద్యార్థులకు అక్టోబర్‌లో ప్రోత్సాహకాలు అందించేందుకు నిర్ణయించారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి పడాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశాం..



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శిరీష, శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: గత మూడేళ్లలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనా యుడు చెప్పారు. స్థానిక జెడ్పీటీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శిరీష మాట్లాడుతూ జెడ్పీటీసీగా బాధ్యతలు స్వీకరించి దాదాపు మూడేళ్లు కావస్తోందని చెప్పారు. మాజీ మంత్రి, ప్రస్తుత శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలో దాదాపు రూ.1.5 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని చెప్పారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, వీధి కాలువలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణంతో పాటు తాగునీటి బోర్ల ఏర్పాటుకు తమవంతు కృషి చేశామని, అలాగే మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు చేశామన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లిన ప్రతి సమస్యకూ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేశారని చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు, నాయకులు అందరి సహకారంతో చీపురుపల్లి మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళతామన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టుకు విశేష స్పందన



వేపాడ: సోంపురం ఉన్నతపాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కొత్తవలస: కేజీబీవీలో పరీక్ష రాస్తున్న విద్యార్థినులు



శృంగవరపుకోట: ధర్మవరం హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తవలస: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించిందని జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ ఎల్.సత్యారావు తెలిపారు.స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు, వియ్యంపేట గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ టి.జయశ్రీ పరీక్ష పేపర్లను విడుదల చేశారు. ఓపీ జిందాల్ పాఠశాల,అమరావతి పాఠశాల కేజీబీవీ, సూర్యోదయ డిఫెన్స్ స్కూల్,కంటకాపల్లి,వియ్యంపేట,కొత్తలస ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు 8,9,10తరగతులకు చెందిన 520 మంది విద్యార్థులు హాజరయ్యారని సత్యారావు తెలిపారు.

సోంపురంలో..

వేపాడ: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోంపురం ఉన్నతపాఠశాలలో బుధవారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. 50 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు తెలిపారు. ఈపరీక్షలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులు మండల స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు.

ధర్మవరంలో..

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక నేతృత్వంలో బుధవారం చెకుముకి పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 8,9,10వ తరగతికి చెందిన 62 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులను అక్టోబర్ 1న నిర్వహించనున్న మండలస్థాయి పరీక్షకు ఎంపిక చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

బుచ్చి అప్పారావు పేరు కొనసాగించాలి



మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేస్తున్న ఎంపీటీసీ చినరామునాయుడు

వేపాడ: తాటిపూడి జలాశయానికి స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును కొనసాగించాలని కోరుతూ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు బుధవారం తీర్మానం చేశారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావే శంలో డీసీసీబీ మాజీ చైర్మన్, నీలకంఠరా జపురం ఎంపీటీసీ సభ్యుడు వేచలపు చినరామునాయుడు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా చినరామునాయుడు మాట్లాడుతూ తాటిపూడి రిజర్వాయర్‌కు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును పెడుతూ జీఓ జారీ చేసిందని గుర్తుచేశారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే ఆయన పేరు తొలగిస్తూ జీఓ జారీ చేసిందన్నారు. రిజర్వాయర్ కోసం ఆయన కృషి చేయడంతో పాటు పది ఎకరాల భూమి ఇచ్చారని, ఈ ప్రాంత ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అటువంటి వ్యక్తి పేరును రిజర్వాయర్‌కు తొలగించడం సరికాదని, కూటమి ప్రభుత్వం పునరా లోచించుకో వాలని సూచించారు. జలశాయానికి బుచ్చిఅప్పారావు పేరును పునరుద్ధరించాలని చేసిన తీర్మానం జిల్లా పరిషత్‌కు పంపిస్తామన్నారు.


ఆధునిక పద్ధతులు పాటించాలి

రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే లాభసాటిగా ఉంటుందని జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏడీ అన్నపూర్ణ, గజపతినగరం, కొత్తవలస సబ్‌డివిజన్‌ల వ్యవసాయ శాఖ ఏడీఏలు కె.మహరాజన్, ఎల్.విజయ, సూచించారు. గజపతినగరం మండలంలోని తుమికాపల్లి గ్రామంలో ఏఓ సీహెచ్.ధనలక్ష్మి, ఎస్.కోట మండలంలోని పోతనాపల్లి ఏఓ రవీంద్ర, గరివి డి మండలంలోని కోడూరు, కొండపాలెంలో ఏఓ శైలజ, ఎల్.కోట మండలంలోని చందులూరు,మార్లాపల్లిలో ఏఓ స్వాతికుమారి, జామి మండలంలోని అన్నంరాజుపేట,వెన్నె గ్రామాల్లో ఏఓ కిరణ్‌కుమార్, గంట్యాడ మండలంలోని రావివలసలో ఏఓ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి, ఇతర పంటలను పరిశీలించి, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సాగులో ఆధునిక పద్ధతులను వివరించారు. డ్రోన్లతో పురుగుమందుల పిచికారీ, ప్రకృతి వ్యవసాయలో భాగంగా కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు.

– జామి/గజపతినగరం/శృంగవరపుకోట/
చీపురుపల్లిరూరల్(గరివిడి)/
లక్కవరపుకోట/గంట్యాడ



జామి: ఏ.ఆర్.పేటలో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



లక్కవరపుకోట: మార్లాపల్లిలో కషాయాల తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వాతికుమారి



గజపతినగరం: తుమికాపల్లి గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మమరాజన్,తదితరులు



శృంగవరపుకోట: పోతనాపల్లిలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ రవీంద్ర తదితరులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): కోడూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శైలజ



గంట్యాడ: రావివలసలో వరి పంటను ఆశించిన తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ శ్యామ్‌కుమార్